ప్రజాశక్తి
గురువారం 10 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు

కల్యాణమస్తు, షాదీ తోఫాతో
వధూవరులకు లబ్ధి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీ తోఫాతో వధువువరులకు ఆర్థిక లబ్ది చేకూరిందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా మూడవ విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లాస్థాయి కార్యక్రమం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు.. జిల్లాలో 438 మంది లబ్ధిదారులకు రూ.4,37,45,000 నమూనా చెక్కును వధువువరులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పథక సంచాలకులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు పోరాటం

-ఆదివాసీ గిరిజన సంఘం నేతలు- పలు చోట్ల ఆదివాసీ దినోత్సవాలు

పాడేరులో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మన్యంలోని పలు చోట్ల ఆదివాసీ గిరిజన సంఘం నేతలు జెండాలను ఎగురవేశారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు.

పాడేరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించే నైతిక హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నేత పి అప్పల నర్స విమర్శించారు.ప్రపంచ ఆదివాసి హక్కుల దినం పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జెండాను జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మన్నపడాల్ ఆవిష్కరించారు. అనంతరం పి.ఎం.ఆర్‌సి సమావేశ మందిరంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనరస మాట్లాడుతూ, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనం కోసమే ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల హక్కులపై పాలకవర్గాలు దాడిని చేస్తున్నాయని అదే పద్ధతిని భారతదేశ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. మరో పక్క ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పేరు పాలక వర్గాలు సభలు,సమావేశాల పేరిట హడావుడి చేయడం చేయడం తప్ప ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి లేదని, ఆదివాసీ దినోత్సవం నిర్వహించే నైతిక హక్కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కు లేదని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు మాట్లాడుతూ, పివిటిజీలకు సీసీడీపీ నిధులు, ట్రైకార్ వ్యక్తిగత రుణాలు, వ్యవసాయ వాణిజ్య పంటల యంత్రాల పరికరాలు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.సుందర్‌రావు, మండల కార్యదర్శి సత్యనారాయణ, జీనబంధు ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటరీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పాంగి కుమారీ, జిల్లా కార్యదర్శి కొర్ర సర్బ్బా నాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, మాణిక్యం, వంతల దాసు చిన్నారి, చంద్రయ్య, కొండయ్య, సాంబపాల్గొన్నారు

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి: ప్రపంచ ఆదివాసుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కొనసాగింది.స్థానిక హరిత హిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఎంపీపీ శెట్టి. నీలవేణి పాల్గొన్నారు ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ఆదివాసి చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్. కొండలరావు, జె.సుబ్బారావు, టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.దేవుడు, జిల్లా సహా అధ్యక్షులు శెట్టి. రాంబాబు, ఆదివాసి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గురుదొర, డి.సన్యాసిరావు, కె.రామసుందర్, ఎస్.రాంబాబు, వి.భాస్కరరావు, మల్లేశ్వరరావు, రామకృష్ణ, మహిళా సంఘం ప్రతినిధులు కాసులమ్మ, .దేవుడమ్మ పాల్గొన్నారు

దుంబ్రిగుడ: ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని స్థానిక మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మండల కేంద్రంలో జంక్షన్ వరకు భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు.గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు, టి సూర్యనారాయణ మాట్లాడుతూ, అనేక గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెనలు ,తాగునీరు, విద్యా వైద్య వంటి సౌకర్యాలు అందగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

అరకులోయ రూరల్: మండలంలోని చొంపి పంచాయతీ పప్పుడువలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం మండల నాయకులు రామారావు, ఎస్.మల్లేష్, బి.కోగేష్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆదివాసి దినోత్సవాన్ని ఎం.పి.పి కొర్రా పద్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిబాబు, మండల ప్రధానకార్యదర్శి కిముడు కళ్యాణం, ఎస్. నాగబ్బాయి, ఎస్టి సెల్ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను, కార్యదర్శి కొర్ర నర్సయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి కొర్ర నర్సయ్య గిరిజన సంఘం పతకాన్ని ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చెండా మత్స్యరాజు, ఐద్వా మండల కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా ఉప అధ్యక్షులు టీ.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.వి.అ.ర్.ఏ యూనియన్ నాయకులు ఎం.మోహన్‌రావు గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళ సంఘం కార్యదర్శ హైమవతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు పి.సోమన్న, రామారావు పాల్గొన్నారు.

పెదబయలు : వివిధ పాఠశాలల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక సిఎహెచ్ పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్.పురం: గిరిజన హక్కులు, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాయాలని చూస్తే తిరుగుబాటు తప్పదని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రం రేఖపల్లి జంక్షన్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల నాశనానికి కంకణం కట్టుకున్నాయని మండిపడ్డారు. సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టి గిరిజనులు, గిరిజన మహిళలపై దాడి చేశారని, దీనిపై గిరిజన ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాగపూర్ రైల్వే స్టేషన్‌లో...

కూనవరం : ఢిల్లీలో ధర్నా అనంతరం తిరుగు ప్రయాణంలో మహారాష్ట్ర నాగపూర్ రైల్వే స్టేషన్లో కూనవరం, ఎటపాక, మండలాల గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూనవరం వైస్ ఎంపీపీ కొమరం, గిరిజన సంఘం నాయకులు కాక అర్జున్, బి.కిరణ్, ఇర్పా అజయ్, బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, సోడే శంకర్, రాజు, సమ్మక్క, కుంజ రాధ, సోయం వీరమ్మ, కన్నారావు పాల్గొన్నారు.

ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో...

రాజవొమ్మంగి : పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కరించాలని ఢిల్లీలో ధర్నాకు వెళ్లిన ఆదివాసీలు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తెల్లం రామకృష్ణ ఆధ్వర్యంలో ఢిల్లీ రైల్వేస్టేషన్లో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, గిరిజన సంఘం ఎపి రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఆదివాసీలను అడవి నుండి గెంటివేసే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని, అందుకోసమే నూతన అటవీ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.నాగేశ్వరరావు, సిరిమలి రెడ్డి, ఎ.రవి, ఎమ్ వాణిశ్రీ, కె.సూరిబాబు, కె జగన్నాథం, రమేష్, రాజు, టి శ్రీను, నాగమణి పాల్గొన్నారు.

ఢిల్లీలో రైల్వే స్టేషన్‌లో ర్యాలీ చేపడుతున్న నాయకులు

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గిరిజనుల భూముల రక్షణకు చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్ - ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. స్థానిక ప్రైవేటు కళ్యాణ మండపంలో పాడేరు శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్లో కలెక్టర్ మాట్లాడుతూ, 50 రోజుల్లో సమగ్ర గిరిజనాభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. పివిటిజిల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంఎల్‌ఎ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఆదివాసీ ఆచార సాంప్రదాయాలు కనుమరుగుకాకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సుభద్ర మాట్లాడుతూ, ఆదివాసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేసారని చెప్పారు. పిఓ అభిషేక్ మాట్లాడుతూ,టిడిఏ పరిధిలో. పాడేరు నియోజక వర్గంలో రూ.100 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు ఎ.పి.మెడికల్ కౌన్సిల్ సభ్యులు తమర్భ నరసింగరావు, పాడేరు ఎంపిపి ఎస్.రత్నకుమారి, పాడేరు సర్పంచ్ కె.ఉషారాణి, ఎస్టీ, కమీషన్ సభ్యులు టి.లిల్లీ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా, డిఎల్‌పిఓ పి.ఎస్ కుమార్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : భారత రాజ్యాంగంలో కల్పించిన గిరిజన హక్కులు, చట్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. అరకులోయ అంజాలి రిసార్ట్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఏపీ రాష్ట్ర ఎస్టీ ఆదివాసీ ఛైర్పర్సన్ పాచిపెంట కుమారి ఆధ్వర్యాన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రంపచోడవరం ఐటిడిఎ ఆధ్వర్యంలో స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఏడు ఆదివాసీ తెగలకు చెందిన పెద్దలతో కలిసి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. వైటిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ఆదివాసీ సంస్కృతులకు సంబంధించిన స్టాల్స్‌ను ఆమె సందర్శించారు. ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి, ఎడిఎంహెచ్‌ఓ భాస్కర్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో మారేడుమిల్లి సర్పంచ్ కొండా జాకబ్ ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. వనవాసి సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్ మాట్లాడారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, జడ్పిటిసి బాలాజీ బాబు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జయంతి, తహశీల్దారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : గిరిజన, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ ర్యాలీ చేసి, స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఎంపీపీ గొము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ కె తాతఅబ్బాయి దొర, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాఆచారి, స్థానిక ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్, గిరిజన నాయకులు వంతు బాలకృష్ణ, అచ్చారావు, శ్రీను పాల్గొన్నారు.

సీలేరు : జీకే మండలం సీలేరులో గిరిజనులు పూర్వపు ఆచారాలకు ప్రకారంగా వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ ఏసు వరరాజు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

అంగన్‌వాడీ వర్కర్లకు పని భారం తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

అంగన్వాడీ కార్యకర్తలపై పని భారం తగ్గించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సున్నం రంగమ్మ, మండల కార్యదర్శి రాజేశ్వరి, కనకమహాలక్ష్మి ఆధ్వర్యాన బుధవారం సిడిపిఒ నాగలక్ష్మికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ రకరకాల యాప్‌లను పెట్టి అంగన్వాడీలపై పని భారం పెంచడం దారుణమన్నారు. ఎఫ్‌పి షాప్ నుండి బియ్యం తేచ్చుకోడం ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వమే నేరుగా సెంటర్‌లకు బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్ వైజర్ పోస్టులకు వయో పరిమితి ఎత్తి వేయాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సునీత, సుజాత, చుక్కమ్మ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుపై అక్రమ కేసులు అన్యాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : పుంగనూరు, అంగళ్ల ప్రాంతాలలో రచ్చ చేసి, దాడులకు ఉసిగొల్పి, ఇప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబుపై కేసు నమోదు చేయించడం వైసిపి నాయకుల కుట్రలకు అద్దం పడుతోందని టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై చంద్రబాబు చేపట్టిన యుద్ధభేరితో వైసిపి నేతల వెన్నులో వణుకు మొదలైందని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో చంద్రబాబు సంధించే ప్రశ్నలకు వైసిపి పెద్దలు సమాధానం చెప్పలేకపోతున్నారని, రోడ్ షోలకు, యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి వారికి అసహనం పెరిగిపోతుందని ఆరోపించారు. అందుకే చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి తెలుగుదేశం శ్రేణులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పుంగనూరు ఘటనపై విచారణ సిబిఐకు అప్పగిస్తే వైసిపి ప్రభుత్వం అసలు రంగు బయటపడుతుందని పైలా అన్నారు.

నీటి వినియోగంపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై బుధవారం ఒడిశా మల్కనగిరి జిల్లా చిత్రకొండ ఓహెపీసీ కార్యాలయంలో ఇరు రాష్ట్రాల అధికారులు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023 -24 నీటి సంవత్సరంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకున్నాయో లెక్కలను తేల్చారు. 2022-23 నీటి సంవత్సరంలో ఆంధ్ర ఒడిశా కంటే 13.7578 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకుందని, 2023 జూలై నెలలో ఏపీ వాటాగా వినియెగించుకున్న 4.2470 టీఎంసీల నీటితో కలిసి 18.0048 టీఎంసీల నీటిని ఆంధ్ర వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ఒడిశా ఇప్పటివరకు తన వాటాగా 6.2622 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు కట్టారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో 35.9200 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా ఈ నెలాఖరు నాటికి రెండు జలాశయాల్లో 20 టీఎంసీల ఇన్‌ఫ్లో చేరుతాయని అధికారులు లెక్కలు కట్టారు. దీని ప్రకారం బలిమెల జోలాపూర్ రిజర్వాయర్లలో 55.9200 నీటి నిల్వలు ఉన్నాయని ఇందులో ఆంధ్ర వాట 22.0887 టీఎంసీలుగాను, ఒడిశా వాటా 33.8313 టీఎంసీలుగా కేటాయించారు. ఈ సమావేశంలో ఒడిశా అధికారులు జనరల్ మేనేజర్ ప్రసాద్ రావు (ఎలక్ట్రికల్), మేనేజర్ ప్రకాష్ నాయక్, ఆంధ్ర అధికారులు ఎస్సీ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ఏడిఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

సంఘం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం

అల్లూరి సీతారామరాజు జిల్లా కమ్యూనిటీ పారామెడిక్స్, హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలియజేసింది. అసోసియేషన్ సమావేశం స్థానిక భాను కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. ముందుగా రాజమండ్రికి చెందిన ప్రముఖ ఫస్ట్ ప్లస్ ఎమర్జెన్సీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బి.ఆర్.కళాధర్‌రెడ్డి సభ్యులకు వైద్య విజ్ఞాన తరగతులు నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. కన్వీనర్‌గా కె.జగదీష్, కో కన్వీనర్లుగా బీవీ సత్యనారాయణ, చిన్నం సిల్వెస్టర్, ఎం.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులను రాష్ట్ర, జిల్లా నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలు చేయడానికి ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు తోరాటి భాస్కర్‌రావు, కార్యదర్శి విబిటి రాజు తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు, కో కన్వీనర్లు బల్లా శ్రీనివాసరావు, గోకవరం ఏజెన్సీ మండలాల గౌరవ అధ్యక్షులు పిన్ని, అధ్యక్ష కార్యదర్శులు ఎం.నాగేశ్వరావు, వై పవన్ కుమార్, కోశాధికారి డి నాగార్జున పాల్గొన్నారు.

నూతన ఎన్నికైన నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

పోస్టాఫీసుల్లో జాతీయ జెండా అమ్మకాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలో అన్ని సబ్ పోస్టాఫీస్, బ్రాచ్ పోస్టాఫీసులలో అగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు రంపచోడవరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ తాతునాయుడు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేవలం రూ.25కే జాతీయ జెండాను అందిస్తున్నామన్నారు. గ్రామాలలోని ప్రజలు సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్లి జాతీయ జెండాను కొనుగోలు చేసుకొని, స్వాతంత్ర్య దినోత్సవ వేడకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. మారుమూల గ్రామాల ప్రజలకు పోస్టాఫీసు సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో అనేక పథకాలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నూతన బ్రాంచ్ పోస్టాఫీసులను లోతట్టు ప్రాంతాలలో ప్రారంభిస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ పోస్టల్ పథకాలు ఎంతోగానో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఈ రోజు మనం కూడబెట్టిన ప్రతి రూపాయి రేపటికి మనకు, మన భావితరాల వారి ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రజలకు పోస్టల్ సర్వీసులు, పథకాలు గురించి తెలిసే విధంగా తమ సిబ్బందితో గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేసి వారికి సమావేశాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరైన పోస్టల్ పథకం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మకులు

సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

విద్యుత్ ఉద్యోగుల జెఎసి నేతల స్పష్టం

ప్రజాశక్తి -సీలేరు

ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 10 నుండి నిరవధిక సమ్మె చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకులు వై.సత్తిబాబు, వై.దాద్రాజు హెచ్చరించారు. జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్ కార్యాలయం ముందు జెఎసి ఆధ్వర్యాన విద్యుత్ ఉద్యోగులు బుధవారం సమావేశం నిర్వహించారు. తమకు న్యాయపరమైన కోర్కెలు పూర్తిస్థాయిలో ఏపీ జెన్కో యాజమాన్యం నెరవేర్చకపోతే గురువారం రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టబో నిరవధిక సమ్మెలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేసే విధంగా కార్యచరణ రూపొందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు న్యాయపరమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ రాష్ట్ర నాయకులతో జెన్కో యాజమాన్యం అనేకసార్లు తమ డిమాండ్ల సాధన కొరకు చర్చలకు పిలిచిన నెరవేర్చలేదని వాపోయారు. తాజాగా బుధవార చర్చలు జరుపుతుందని, సఫలీకృతం అవుతాయని ఆశిస్తున్నామని, లేకుంటే నిరవధిక సమ్మె తప్పదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈఈ ప్రభాకర్, ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్, జేఏసీ నాయకులు శివప్రసాద్, భవాని శంకర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు ఆర్.అనిల్, బి.లక్ష్మణ్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

200 ఆవులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండల కేంద్రంలో బుధవారం పశువైద్యాధికారి సీహెచ్ తరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 200 ఆవులకు లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల10న మండలంలోని అమ్మిరేకుల గ్రామంలో లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు ఏసుబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

19న ఉప ఎన్నికలు

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు సర్పంచ్, 66 వార్డ్ సభ్యుల పదవులకు ఈ నెల 19 న ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10న నామినేషన్లు దాఖలు, 11న నామినేషన్లు పరిశీలన,12న తిరస్కరణ అప్పీల్, 13న అప్పీల్, 14న ఉపసంహరణ, 19న పోలింగ్ నిర్వహిస్తామని, అదే రోజు ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

జాబ్ మేళాలో 17 మంది ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళలో 61 మంది నిరుద్యోగులు పాల్గొనగా 17 మంది ఎంపిక అయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జీ.ప్రశాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కొర్ర సబ్ సెంటర్ కేంద్రంలోని బుధవారం వైద్య శిబిరం జరిగింది. 38 మంది వ్యాధిగ్రస్తులకు వైద్యాధికారి పాంగి రాంబాబు చికిత్సలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి, ఏఎన్ఎం, 104 అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రొఫెషనల్స్ కోసం ఎన్‌కోర్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : మహిళా ప్రొఫెషనల్స్ కోసం కెరీర్ ఎనేబుల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు లిండే హెచ్ఆర్ హెడ్ నీతా చక్రవర్తి తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, విశ్రాంతి తర్వాత తమ వృత్తిని పున్ణప్రారంభించాలనుకునే మహిళా నిపుణుల కోసం ప్రత్యేకంగా ఎన్‌కోర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించామన్నారు. ఎన్‌కోర్ ట్రైనింగ్ ప్రోగ్రాం అనేది కెరీర్‌లో విరామం తీసుకున్న పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలు, డిప్లమో, అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు చేసిన మహిళలకు అందుబాటులో ఉంటుందన్నారు. నైపుణ్యాలను రిఫ్రెష్ చేయడంలోనూ, జ్ఞానాన్ని నవీకరించడంలోనూ సహాయపడే లక్ష్యంతో 12 నుంచి 18 నెలల పాటు సమగ్ర ఉద్యోగ శిక్షణను అందించనున్నామని తెలిపారు. కెరీర్ విరామంలో నైపుణ్యం మెరుగుపరచుకోవాలని, తిరిగి శిక్షణ పొందాలని చూస్తున్న మహిళా నిపుణుల ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

ప్రపంచ శాంతిని కోరుతూ నాగసాకి దినం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : అణు బాంబుల తయారీని ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఖండించినప్పుడే ప్రపంచంలో శాంతి వర్ధిల్లుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ నెట్‌వర్క్, ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్ సంయుక్తంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం నాగసాకి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు జెవి.ప్రభాకర్, రాంప్రభు, సన్‌మూర్తి మాట్లాడుతూ, వివిధ దేశాల మధ్య వైరుధ్యాలు ప్రపంచ మానవాళికి ప్రమాదకరమని, ముఖ్యంగా అణ్వాయుధాలు వాడకం ద్వారా జరిగే పరిణామాలను అన్ని దేశాలు గుర్తించాలన్నారు. హిరోషిమా, నాగసాకి ప్రాంతాలలో 1945లో అమెరికా జపాన్‌పై వేసిన అణుబాంబుల దాడితో జరిగిన విధ్వంసాన్ని గుర్తించాలన్నారు.

దయనీయం.. విఆర్ఎల బతుకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో విఆర్ఎల పరిస్థితి దయనీయంగా తయారైంది. గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ)లు గా పని చేస్తున్న జిల్లాలోని 311 మంది రెవెన్యూ సిబ్బంది కష్టాలు ఎప్పటికీ తీరుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా.. ఆందోళన, నిరసనలు చేపట్టినా.. ప్రభుత్వం మాత్రం తమపై కనికరం చూపడం లేదని విఆర్ఎలు వాపోతున్నారు. నేటికీ తమ డిమాండ్లు హామీలుగానే మిగిలి పోయాయని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. విఆర్ఎల డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. డిఎలను వేతనంతో కలిపి పూర్తిగా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పే స్కేల్ అమలు చేయాలని, అర్హులకు విఆర్ఓ, అటెండర్, డిఎ రికవరీ నిలిపివేసి టిఎతో కూడిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉందని, విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా ఫలితం శూన్యం అని విఆర్ఎలు తెలిపారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ ఉండాలని నూతన పద్ధతి పెట్టిందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఎలు ఎక్కువమంది వయస్సు రీత్యా ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ ఇచ్చే పరిస్థితి లేదని, సచివాలయాలకు, తహసిల్దార్ కార్యాలయాలకు దూరంగా ఆవాస గ్రామాలలో ఉంటున్నామని వారు పేర్కొన్నారు. గతంలో 2018లో కూడా ప్రభుత్వం బయోమెట్రిక్ వేయాలని నిబంధన తీసుకు వచ్చి నప్పుడు కూడా ఆచరణలో సాధ్యం కాదని, తమ విజ్ఞప్తి మేరకు బయోమెట్రిక్ నుండి మినహాయింపు ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అర్హత కలిగిన విఆర్ఎలకు విఆర్ఓలుకు పదోన్నతిని, భూ సర్వే సందర్భంగా విఆర్ఎలకు టిఎ, డిఎ ప్రభుత్వమే చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు. విఆర్ఎల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని విఆర్ఎలు తెలిపారు.

హామీలు నెరవేర్చాలి..

ప్రతిపక్ష నేతగా గ్రామ సేవకులను రెగ్యులర్ చేస్తామని, జీతం పెంచుతామని, పిఆర్ సి అమలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఇచ్చిన డిఎ వెనక్కి తీసుకోవడం దారుణం. పిఆర్‌సి అమలు చేయాలి. రీ సర్వేలో ప్రతి విఆర్ఎకు డిఎతో కూడిన ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి. చనిపోయిన గ్రామ సేవకుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి.

ఆర్.పూర్ణ చంద్రశేఖర్
విఆర్ఎల జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి..

రెవెన్యూ శాఖలో అత్యంత కీలకమైన విధులు నిర్వహిస్తున్న విఆర్ఎల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గ్రామ సేవకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అర్హత కలిగిన విఆర్ఎలకు పే స్కేల్ వర్తింప చేయాలి. నామినీలను విఆర్ఎలుగా నియమించాలి. అర్హులకు పదోన్నతులు కల్పించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చాలి. విఆర్ఎల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తాం.

బి.కొండబాబు
విఆర్ఎల జిల్లా అధ్యక్షుడు

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక తలారిసింగి ఉన్నత పాటశాల మైదానంలో ఉదయం ప్రారంభమవుతా యన్నారు. మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంశా పత్రాలు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పేరేడ్ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ నిర్వహించాలన్నారు.జిల్లా పౌర సరఫరాలు, గిరిజన సంక్షేమం, విద్యా, వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు, కుటుంబ సంక్షేమం, వైద్య శాఖ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, రహదారుల భద్రత, అగ్నిమాపక శాఖ మరియు, డ్వామా తదితర శాఖలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకతాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐటిడిఎ, వెలుగు, వ్యవసాయ అనుబంద శాఖలు, కాఫీ, జిసిసి, నెడ్ క్యాప్, తదితర శాఖలు ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, జిల్లా రెవిన్యూ అధికారి పి.అంబేద్కర్, డిఎస్ఓ గణేష్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జమాల్ బాషా, గృహ నిర్మాణ సంస్థ ఇఇ బాబు, డిఆర్డిఎ పథక సంచాలకులు వి.మురళి, ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు నందు, రమేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హాజరు ఫోటోలు పంపండి

సచివాలయ సిబ్బంది విధులకు సరిగా హాజరు కాలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో వారి హాజరును ఫోటోలతో సహా నివేదిక సమర్పించాలని ఎంపిడిఓలను జిల్లా కలక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని, ఎంపిడిఓలు, తహసిల్దార్లతో వీడియో సమావేశం సమావేశం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ సహాయకులు తప్పనిసరిగా సచివాలయాలలోనే విధులు నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగా బియ్యం కార్డులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వివిధ కారణాలపై తిరస్కరించపై ఆరా తీసిన కలెక్టర్ తహసిల్దార్లకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని డిఆర్ఓ అంబేద్కర్‌ను ఆదేశించారు. అమ్మ ఒడి. వైఎస్సార్ భీమా, కళ్యాణమస్తు, రైతు భారోశా తదితర పథకాలపై అవగాహన కల్పించి వారికి లబ్ది చేకూర్చాలన్నారు. పాటశాలలకు వెళ్ళని విద్యార్థులను గుర్తించి సంబంధిత వాలంటీర్ ద్వారా తిరిగి హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయకర్త సునీల్, కలక్టరేట్ తహసిల్దార్ చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖలో వారాహి విజయయాత్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జనసేన మూడో విడత వారాహి విజయయాత్ర గురువారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు విశాఖలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ వెల్లడించారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గురువారం మధ్యాహ్నం పవన్ కల్యాణ్ వైజాగ్ చేరుకుంటారని, సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్ వద్ద వారాహి వాహనంపై నుంచి ప్రసంగిస్తారని తెలిపారు. వైసిపి పాలనలో ఉత్తరాంధ్రకు జరిగిన దోపిడీని వివరిస్తారని చెప్పారు. ఈ నెల 19వ తేదీ వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోనే పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, వారాహి యాత్ర వల్ల ఎక్కడా ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బంది ఉండకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా విశాఖ విమానాశ్రయం నుంచి దసపల్లా హోటల్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పిఎసి సభ్యుడు కోన తాతారావు, మూగి శ్రీనివాసరావు, సంకు వెంకటేశ్వరరావు, వలివిరెడ్డి సతీష్, పీలా రామకృష్ణ, బొలిశెట్టి శ్రీకాంత్, పైడికొండ సునీల్, ముసలయ్య, గుంటూరు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్ర ఒక వెబ్ సిరీస్ : అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేస్తానని పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి విజయ యాత్రను వెబ్ సిరీస్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. సర్క్యూట్ హౌస్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ, సినీ రంగ ప్రవేశానికి విశాఖలోనే ఓనమాలు దిద్దుకున్న పవన్ కల్యాణ్ విశాఖ నగరానికి చెందిన ఆడబిడ్డను పెళ్లి చేసుకుని వదిలేసి 15 ఏళ్ల కిందటే ఈ ప్రాంతానికి అన్యాయం చేశాడని విమర్శించారు. గతంలో ఈ ప్రాంత సమస్యలపై తాము అనేక పోరాటాలు చేసామని, అప్పుడు పవన్‌కల్యాణ్ ఏమయ్యాడని ప్రశ్నించారు. విశాఖలో చంద్రబాబు అనుచరులు భూములను ఆక్రమించుకున్నప్పుడు పవన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బిజెపితో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో మౌనంగా ఉన్నారన్నారు. బిజెపితో సంసారం, బాబుతో సహజీవనం చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని వ్యాఖ్యానించారు.

రంగపర నార్త్ - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అదనపు రద్దీని క్లియర్ చేయడానికి సికింద్రాబాద్-రంగపర నార్త్‌లో వన్ వే ప్రత్యేక రైలు నడపాలని రైల్వే నిర్ణయించింది. రైలు నెంబర్ 02814 రంగాపర్ నార్త్-సికింద్రాబాద్ వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు రంగాపర్‌నార్త్ ఈనెల 8 ఉదయం 05:15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.30 గంటలకు విశాఖపట్నం, మరుసటి రోజు ఉదయం 4.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. రంగపర నార్త్, సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, విశాఖపట్నం, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుంది.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సంబల్‌పూర్ డివిజన్‌లోని సంబల్‌పూర్, సంబల్‌పూర్ సిటీ స్టేషన్‌లలో భద్రతకు సంబంధించిన ఆధునికీకరణ పనుల కారణంగా ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు 18301 సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు, 18302 రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్ళను రద్దు చేశారు. 20809 సంబల్‌పూర్-నాందేడ్ నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 20, 21 తేదీలలోను, 20810 నాందేడ్-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలును 21, 22 తేదీలలోను, 08311 సంబల్‌పూర్-ఈరోడ్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు 23న, 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును ఈ నెల 25వ తేదీన రద్దు చేశారు.

సంత్రాగచ్చి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్-1 ప్రారంభానికి ట్రాఫిక్-కమ్-పవర్ బ్లాక్ కారణంగా, ఖరగ్‌పూర్ డివిజన్‌లోని టికియాపరా వద్ద ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ఈ నెల 12న 12704 సికింద్రాబాద్- హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 18006 జగదల్పూర్- హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లను, 13న 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 18005 హౌరా-జగ్దల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైళ్ళను రద్దు చేశారు.

విజయవాడ డివిజన్‌లో..

విజయవాడ డివిజన్‌లోని మనుబోలు-గూడూరు సెక్షన్‌లో మూడో లైన్ పనులకు సంబంధించి నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 12న 18637 బెంగళూరు-హతియా, 22606 విల్లుపురం-పురూలియా, 14న 22605 పురూలియా-విల్లుపురం, 22643 ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను, 17న 22644 పాట్నా-ఎర్నాకులం రైళ్ల రద్దు చేశారు. 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 9, 11, 13 తేదీల్లో, 22707 విశాఖపట్నం-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 10, 12, 14 తేదీల్లో రద్దు చేశారు.

యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వీడాలి

సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

37వ రోజుకు నిర్వాసిత కార్మికుల దీక్షలు

మాట్లాడుతున్న సిఐటియు నేత కెఎం.శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను బానిసలుగా చేసి, వారి శ్రమను దోచుకుంటోందనిసిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం. శ్రీనివాసరావు మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అండతోనే నిర్లక్ష్యధోరణి వ్యవహరిస్తున్న యాజమాన్యం ఇప్పటికైనా కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల నిరవధిక నిరసనలు బుధవారం 37వ రోజుకు చేరుకున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ ఆదాని క్విట్ మోడీ, సేవ్ ఇండియా, సేవ్ వర్కర్ నినాదంతో ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు శిబిరం వద్ద నుండి పెదగంట్యాడ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై దీక్షలు చేస్తున్న కార్మికులతో పలుదఫాలుగా చర్చలు జరిగినా, యాజమాన్యం మొండివైఖరి వీడకపోవడం దుర్మార్గమన్నారు.

శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికుల పట్ల యాజమాన్యం వైఖరి ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. కార్మికుల వేతన పెంపు, ఇతర సమస్యల పరిష్కారంపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం పోర్టు యాజమాన్యం హెచ్ఆర్ మేనేజ్‌మెంట్ సి ఎస్ రాజుతో కూడిన బృందం శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. వైవి సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలకు యాజమాన్యం కట్టుబడి ఉందని, ముందుగా కార్మికులు విధుల్లో చేరాలని, తర్వాత వేతన పెంపుపై చర్చిద్దామని ఆహ్వానించారు.అలాకాకుండా . ఉద్యోగాల నుండి తొలగించిన వారిని ఎప్పటిలోగా విధుల్లోకి తీసుకుంటారో, వేతన పెంపు ఎంత ఉంటుందో ముందుగా స్పష్టత నివ్వాలని యూనియన్ ప్రధాని కార్యదర్శి లొల్లి తాతారావు కోరారు. స్పష్టత లేకుండా విధులకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, యూనియన్ నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాది అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు..

అణ్వస్త్ర రహిత ప్రపంచంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : అణ్వస్త్రాలు వద్దు, అన్నం. వస్త్రాలు వడ్డించండి అన్న నినాదంతో నాగసాకి సంస్మరణ దినోత్సవాన్ని అక్కయ్యపాలెం వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబు దాడులు జరిగి 78 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం నాగసాకి సంస్మరణ దినం ఫోటో ప్రదర్శన నిర్వహించారు. అణ్వాయుధాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అణ్వస్త్ర రహిత ప్రపంచం.కావాలని కోరుతూ బివి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఫోటో ప్రదర్శనను పారిశ్రామికవేత్త భరణికాన రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అణుశక్తిని మానవ వికాసానికే తప్ప వినాశనానికి వద్దని ఆకాంక్షించారు. చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ హిరోషిమా,నాగసాకి దినోత్సవాల సందర్భంగా పలు విద్యాలయాల్లో అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమలో వాణిజ్య పన్నుల శాఖ మాజీ అధికారి నాయుడు, .ప్రిన్సిపల్ ఎంవివి .సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ శైలజ, పాల్గొన్నారు.

వచ్చేనెల 18న అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీ

విశాఖ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహణ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ చరిత్రలో మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్‌ను వచ్చేనెల 18 నుంచి 23 వరకూ నగరంలోని ముడసర్లోవ ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ మైదానంలో నిర్వహించనున్నట్లు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వైజాగ్ గౌరవ కార్యదర్శి ఎంఎస్ఎన్.రాజు తెలిపారు. బుధవారం ముడసర్లోవ క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, 1984లో ఈస్ట్ పాయింట్ కాలనీ (ఉడా పార్కు) వద్ద స్థాపించిన ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌కు ముడసర్లోవ వద్ద గల ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించిందని గుర్తు చేసారు. 2021లో ఛాంపియన్‌షిప్ గోల్ఫ్ క్లబ్‌గా ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు.

వచ్చేనెల 18 నుంచి ప్రారంభమయ్యే పిజిటిఐ టోర్నమెంట్‌లో భారత్‌తోపాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశాల నుంచి మొత్తం 126 మంది ఉత్తమ గోల్ఫ్ ఆటగాళ్ళు పాల్గొంటారన్నారు. ఈ అధికారిక ప్రపంచ గోల్ఫ్ ఆటలో వచ్చిన ర్యాంకింగ్ పాయింట్స్ ఒలింపిక్స్ ప్రపంచ ఈవెంట్స్‌కి అర్హత సాధించేందుకు దోహదపడతాయన్నారు. ఈ టోర్నీని యూరో స్పోర్ట్స్, సోషల్ మీడియా స్ట్రీమింగ్ ఎబిసి న్యూస్ దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేస్తాయన్నారు. ఈ టోర్నమెంట్ నగరంలో ఆతిధ్యం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ దేశంలో ఉన్న పారిశ్రామిక సంస్థలను ఆకర్షించేవిధంగా ఉంటుందన్నారు. సమావేశంలో మార్కెటింగ్ టూర్ విభాగం హెడ్ వికాస్ సింగం, కోశాధికారి పి.రామకృష్ణారావు, సభ్యులు పివిఎల్ఎన్.రాజు, టికె.రాజు, ఎన్‌విహెచ్ రాజేంద్ర, డిటి.రావు, జి.విజయ్ కుమార్, డి.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సభ్యులు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

సిటీ బస్‌లో ప్రయాణించిన టిడిపి నేత శ్రీభరత్

ఆర్‌టిసి సిటీ బస్‌లో ప్రయాణికులతో శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : బస్‌స్టాప్‌ల ఆధునికీకరించే సమయంలో నగరంలోని సిటీబస్ ప్రయాణికులకు అవసరమైన మెరుగైన సౌకర్యాలపై నగరపాలక సంస్థ దృష్టి సారించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి ఎమ్.శ్రీభరత్ సూచించారు. డైలాగ్ విత్ భరత్, వార్డులలో పాదయాత్ర, ప్రజలతో ముఖాముఖి వంటి కార్యక్రమాల ద్వారా దూకుడు పెంచిన యువనేత బుధవారం నగరంలోని సిటీ బస్‌కాంప్లెక్స్ నుంచి భీమిలి వెళ్లే ఆర్‌టిసి బస్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య కూడళ్ళలో నిర్మించే బస్‌స్టాప్ వద్ద మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని కొందరు ప్రయాణికులు శ్రీభరత్‌ను కోరారు. అలాగే సీనియర్ సిటజన్లకు ప్రత్యేక సౌకర్యం కావాలని కొందరు సూచించారని తెలిపారు. రుషికొండ కూడలి వరకు సాధారణ ప్రయాణికులతో పాటు ప్రయాణించిన శ్రీభరత్, బస్ దిగిన అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత బస్‌ఛార్జీలు అధికంగా ఉన్నాయని, అందుకే ఎసి బస్ సదుపాయం కల్పించినా వినియోగించుకునేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబరచలేదన్నారు. నిత్యం అధిక దూరం ప్రయాణించే బస్‌పాస్ ప్రయాణికుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. వివిధ వర్గాల ప్రజలను కలవడం, వారి ఆలోచనలను తెలుసుకోవాలన్న ఆసక్తితోనే తాను సిటీ బస్‌లో ప్రయాణించినట్లు తెలిపారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించండి

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 61వ వార్డు జనతాకాలనీ గెడ్డలలో పూడిక తొలగింపు పనులను బుధవారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా స్వచ్ఛతపై అవగాహన పెంచుకుని ఇంట్లోని తడి,పొడి, ప్రమాదకరమైన చెత్తను ఎక్కడికక్కడే పడేయకుండా, ఇంటింటికీ వచ్చే జివిఎంసి వాహనానికి అందించాలని సూచించారు. అలా కాకుండా రహదారులు, కాలువల్లో వేయరాదన్నారు. కొందరు అవగాహనా రాహిత్యంగా కాలువలలో వేస్తున్న వ్యర్థాల వల్ల వాడిక, వర్షపునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా, వ్యాధులకుహేతువుగా మారుతోందన్నారు. స్వచ్ఛత యాప్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొని స్వచ్ఛసర్వేక్షణ్ పోటీలలో విశాఖకు మొదటి ర్యాంకు తెచ్చేందుకు సహకరించాలన్నారు.కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇనిస్పెక్టర్ డి రవికుమార్, సూపర్ వైజర్ నూకరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

విద్యార్థులకు పంపిణీకి మాత్రలు సిద్ధం : డిఎంహెచ్ఓ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి- సీతమ్మధార : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న గురువారం 19ఏళ్లలోపు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని డిఎంహెచ్ఓ డాక్టర్ పి జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఒకటి,రెండేళ్ల పిల్లలకు మాత్రలో ముక్కను, మూడేళ్ల పైబడి 19ఏళ్లలోపు వారికి ఒక్కో మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత అందించి, వారితో చప్పరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు అలాగే గర్భిణులకు ఆల్బండజల్ 400 ఎంజి మాత్రలు ఇస్తామన్నారు.

జిల్లా వ్యాప్తంగా 4, 73, 358 మాత్రలను ఇప్పటికే 1900 పాఠశాలలు, 62 జూనియర్ కాలేజీలు, 742 అంగన్వాడీ కేంద్రాలకు అందజేసేలా సమీపంలోని హెల్త్‌సెంటర్లకు పంపిణీ చేశామన్నారు. లక్ష మాత్రలు అదనంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుముత, వైద్యులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలి

కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు

కాంగ్రెస్ ఆధ్వర్యాన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలని కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు కోరారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ంసందర్భంగా మాట్లాడుతూ, అరకులో ఆదివాసీ దినోత్సవ సంబరాలను కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించామన్నారు. దేశంలో పదికోట్ల పైచిలుకు ఆదివాసీలుంటే, 700 ఆదివాసీ 75 ఆదిమజాతి తెగల హక్కులను గుర్తించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తోందన్నారు. స్వతంత్రం ముందే గిరిజనులు బ్రిటిష్ వారితో పోరాడి నివాస ప్రాంతాలపై అడవిపై ప్రత్యేక హక్కులు సాధించుకున్నారని స్వాతంత్రం అనంతరం భారత రాజ్యాంగం కూడా వారి ఆచార సాంప్రదాయాన్ని పాటించే స్వేచ్ఛనిచ్చిందన్నారు. . ఆదివాసుల అభివృద్ధి సంక్షేమం కోసం దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ట్రైబల్ పంచశీల అనే పాలసీని తీసుకొచ్చి, 5 అంశాలను పొందుపరిచారన్నారు. ఆదివాసీలు తిండికోసం వలస పోయే పరిస్థితులున్నాయని, విద్యా వైద్యం, తాగునీరు, రహదారులు వంటి సదుపాయాలు లేక నేటికీ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నాడు. అడవులపై వారు సాధించుకున్న హక్కులను తొలగించి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసి హక్కుల దినోత్సవంగా మార్చాలని డిమాండ్ చేశారు.